# మండోదరి

-డా. తాడేపల్లి పతంజలి

అశోక వనములో శింశుపావృక్షము క్రింద బంగారువేదిక.

ఆ బంగారు వేదికపై మలినమైన వస్త్రము ధరించిన ఒక స్త్రీ మూర్తి.

నిద్రపోతున్న రాక్షస స్త్రీల మధ్య ఆ స్త్రీ మూర్తి - సీత - దుఃఖిస్తూ ఉన్న సమయంలో ఎండిన ఆకులు పటపట విరిగిన చప్పుడు....

గజ్జెల మ్రోత విని నిద్రపోతున్న పక్షులు కొన్ని లేచి, అరవటం మొదలు పెట్టాయి. ఆ అరుపులలో గజ్జెల మ్రోతలు కలిసిపోతాయి.

మోకాళ్ళలో తలవంచి - రామభద్రుని తలుస్తున్న సీతమ్మ కొంచెం తలపైకెత్తి చూసింది. ఒక అద్భుతమైన కాంతి మండలం దగ్గర దగ్గరగా వస్తున్నట్లు అనిపించింది సీతకు. తనను చుట్టుముట్టిన ఆ కాంతి మండలాన్ని, నెమ్మది నెమ్మదిగా ఒక స్త్రీగా పోల్చుకొంది.

రావణుని చెరలో అనుభవిస్తున్న దైన్యం ఒక నిమిషం పక్కకు తొలగినట్లయింది, ఆ స్త్రీ నవ్వుని చూచి సీతకు. తన శరీరంలోకి ఏదో కొత్తశక్తి ప్రవేశిస్తున్నట్లనిపించింది, ఆమె కన్నులు చూస్తుంటే...

"ఇంతటి కాంతి కలవాళ్ళు లోకంలో ఉంటారా... అసంభవం.. ఇది... రాక్షసమాయ".

సీత ఆలోచనను "నమస్తే" అను ఆ కాంతి స్వరూప భాషణం తొలగించింది. "కాదు.. కాదు... ఎంత నటనను సముపార్జించుకొన్నా, ఏంత మాయ వేషం వేసినా - మూలంలోని రాక్షసకాపట్యం ఎక్కడో ఒకచోట ప్రతిఫలిస్తుంది ఈమె మొగంలో, స్వరంలో కాపట్యము కనిపించడం లేదు. ఎవరీమె..?" సీత ఊహలు తీగలు సాగాయి.

"ఇక్ష్వాకు కుల తిలకుడు, సకల జనమనోభిరాముడు, పితృవాక్యపరిపాలకుడు, ఏకపత్నీవ్రతుడు, సకల గుణాభిరాముడు శ్రీరాముని ధర్మపత్ని, పుణ్యముల పేటి సీతాదేవికి నమస్సులు.."

దగ్గరగా వచ్చి, వినయంగా చేతులు జోడించి ఆ స్త్రీ మూర్తి పలుకుతుంటే సీతమ్మ మనస్సు పొంగిపోయింది. బీడునేలను వర్షపు చుక్క పలకరించినంత ఆనందం.

తన భర్త గొప్పతనాన్ని, ఇతరులు ప్రశంసిస్తుంటే విని పరవశించే అదృష్టం ఇక జన్మలో లేదేమో... అని ఇన్నాళ్ళు సీతమ్మ దుఃఖావిష్టురాలయింది.

ఇప్పుడు.... తన భర్త గొప్పతనాన్ని పొగుడుతూ ఎంతటి చల్లనైన మాటలు...

తన పెళ్ళయిన కొత్తలో కౌసల్యాదేవి ఒక రోజు రాత్రి తన పక్కనే పడుకొమ్మని కోరింది. రామభద్రుడు మారుమాట్లాడక తల్లి మాటను పాటించమన్నాడు. తను అత్తగారి పక్కనే పడుకొంది. అర్ధరాత్రి ఉన్నట్టుండి అత్తగారు లేపింది. నిద్రలేస్తూనే తన నోటి నుండి వెలువడిన మాటలు "రామభద్రా!" అని...

ఎంతగా కౌసల్యదేవి పొంగిపోయింది.

"అమ్మా... నా బిడ్డ ఎంతో అదృష్టవంతుడు... ఇంతటి ప్రేమమూర్తిని తన జీవిత భాగస్వామిగా చేసుకొన్నాడు. నిద్రలో హఠాత్తుగా లేపినా రామస్మరణ చేస్తున్నావు. నీ ప్రేమ పరీక్షకోసం మీ యిద్దరికి ఒకరాత్రి వియోగం కలిగించినందుకు మన్నించమ్మా" అని అత్తగారు అంటుంటే సిగ్గులమొగ్గయి తను ఆమె కాళ్ళకు నమస్కరించింది.

"శ్రీరామచంద్రులు త్వరలోనే మిమ్ములను కలుస్తారు... దిగులు పడకండి" ఎదురుగా ఉన్న కలభాషిణి మాటలతో వర్తమానంలోకి వచ్చింది సీత.

"మీ...రు?" సీతమ్మ ప్రశ్నించింది. రాముడు కలుస్తాడన్న మాటలకు పొంగిపోతూ...

"ముందు నామీద అభిప్రాయం చెప్పండి. తరువాత నేనెవరో చెబుతాను" ఆ స్త్రీ మూర్తి సీతను

తిరిగి ప్రశ్నించింది.

''మీరు ఆత్మీయతకు అద్దంలా కనబడుతున్నారు. నిలువెత్తు సౌజన్యానికి ప్రతిబింబంలా తోస్తున్నారు. నా భర్తను పొగిడిన మీరు, ఉత్తములనుటలో ఏ మాత్రం సందేహం లేదు" సీతమ్మ దృఢ నిశ్చయంతో అంది.

"నా మీద, నేను మాట్లాడిన రెండు మాటలతోనే ఇంత చక్కటి అభిప్రాయాన్ని ఏర్పరచుకొన్నందుకు ధన్యవాదాలు. చంద్రుడు వెన్నెలతో ఉంటాడు. ఆ రామచంద్రులు మీరనే వెన్నెలతో ఉంటారు. అందుకే వెన్నెల చల్లదనం మీ మాటలలో ఇంతగా వెల్లివిరిస్తోంది" ఆ స్త్రీ మూర్తి సీతను ప్రశంసించింది.

"మీ అంతటి కాంతిమతియైన స్త్రీ మూర్తిని నేను ఏ నాడు జీవితంలో చూడలేదు. మీరు చతుర్దశ భువనాలలో ఏ లోకానికి చెందిన కాంతిమూర్తులు? సకలలోక సౌందర్యకాంతులను జయించిన స్త్రీ మూర్తులవలె భాసిస్తున్నారు." - సీత మాటలను స్త్రీ మూర్తి వెంటనే ఇలా అడ్డుకొంది.

"సకల లోక సౌందర్య కాంతులను మాత్రమే కాదు, సకలలోకాలను జయించికూడా సీతాదేవి భర్త ప్రేమ ముందు నిరంతరం ఓడిపోతున్న దశకంఠుని ధర్మపత్నిని... మండోదరిని..."

"మీరు... మీరు మండోదరియా?" సీతమ్మ ఆశ్చర్యం మాటలలో ప్రవేశించింది.

''యద్యత్పశ్యామి తేగాత్రం శీతాంశు సదృశాననే

తస్మింస్తస్మిన్ పృథుశ్రోణి చక్షుర్మమనిబధ్యతే"

నీ శరీరంలో ఏ అవయవమును చూచినా ఆ అవయవమునందే నా చూపు కట్టుబడుచున్నదని నిర్లజ్జగా వలికిన దుష్టాతిదుష్టుడు రావణుని భార్యయా యీమె?

"నా నుండి మనస్సును మరలింపుము... నీ వారియందు మనస్సు నుంచుకొనుము" అని గడ్డి పోచ సాక్షిగా ఎవరికి ఉపదేశము చేసితిరో, ఆ లంకేశ్వరుని ధర్మపత్నిని నేను... ఇప్పుడు చెప్పండి... నేనెవరో తెలిసిన పిదప, మీకు ఇదివరలో ఉన్న అభిప్రాయం మారిపోయిందా?" మండోదరి అడిగింది.

''ఇదివరలో ఉన్న అభిప్రాయం విపరీతమయింది"

"అంటే?"

"మందోదరి, మండోదరి అయింది." సీత నవ్వుతూ అంది.

"అల్పమైన ఉదరము కలది మండోదరి. మండా అంటే గండుచీమ. దానివంటి ఉదరం కలిగినది మండోదరి. అంటే నన్ను గండుచీమలో పోల్చారా?... నాకు కుట్టే స్వభావం కూడా ఉన్నదని ఉప లక్షణమా?" మండోదరి నవ్వుతూ అన్నది.

"అయ్యయ్యో.. నా ఉద్దేశం అదికాదు.. కేవలం శబ్ద చమత్కారం." సీత జవాబిచ్చింది.

"నత్వాం కుర్మి దశగ్రీవ! భస్మ భస్మార్హతేజసా" నిన్ను భస్మం చేసేంత శక్తి నాకు ఉన్నది. కాని రామచంద్రుని సందేశము లేదు కనుక చేయటం లేదని... నిన్ననే కదా నా భర్తతో చెప్పారు... కేవలం తపశ్శక్తి మాత్రమే కాదు... అద్భుతమైన పాండితీశక్తి కూడా ఉన్నదని ఇప్పుడే తెలిసింది. ఎంతయినా శక్తి స్వరూపిణి జనకతనయ"

"మీ తండ్రి మయుల వారిలోని అద్భుత శిల్పనైపుణి మీ మాటలలోకి వచ్చింది. తల్లిగారు హేమలోని అసమాన కాంతి మీ శరీర ఛాయలోకి వచ్చింది". సీత తిరిగి ప్రశంసించింది.

"కాని నా భర్తలోని దుష్టగుణాన్ని మార్చే శక్తి ఏదైవం నాకు ఇవ్వలేదు" మండోదరి బాధపడింది.

సీత మౌనంగా ఉన్నది రావణప్రసక్తితో..

"నేనిక్కడకు ఈ అర్థరాత్రి ఎందుకు వచ్చానో ఊహించగలరా!'' మండోదరి నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ అడిగింది.

"ఈ సోదరిని అనుగ్రహించాలని వచ్చారు"

"కాదు... నేను అనుగ్రహింపబడాలని వచ్చాను" మండోదరి అన్నది.

"అంటే?"

''ముత్తయిదువుగా మిమ్మల్ని ఒకసారి కలవాలని వచ్చాను".

మండోదరి మాటలతో సీతమ్మ కనుకొలకులలో నీళ్ళు తిరిగాయి.

## చినుకులు

కవితలు
కణికలైతే
కదిలిస్తాయి
కథలైతే
కాలం హరిస్తాయి.

❖ ❖ ❖

విద్య విప'రీత'మైంది
అందుకే కాలేజీలు
కబేళాలౌతున్నాయి.

❖ ❖ ❖

పదవీ ప్రమాణ స్వీకారంతోనే
పెరుగుతున్నాయి
మంత్రుల మేడలు
ప్రారంభోత్సవం నాడే
పడిపోతున్నాయి
పాఠశాలల గోడలు.

❖ ❖ ❖

పేటెంట్ హక్కును కోల్పోతే
దేశం ఔతుంది
పేషెంట్.

❖ ❖ ❖

నేడు
వానలు కురిస్తేనే
పంటలు
రేపు
వాగ్దానాలు కుమ్మరిస్తేనే
ఎన్నికలు.

❖ ❖ ❖

కొబ్బరి బోండాలుండగ
కోలా-పెప్సీ దండుగ.

❖ ❖ ❖

బ్రహ్మరాక్షసులంటె
ఎవరు?
బహుళజాతి కంపెనీలు.

*- శంకరమంచి శ్యాంప్రసాద్*

"క్షమించండి.. ఇప్పటికే నా భర్త చేసిన అవివేకపు పనులతో, మాటలతో మీరు కష్టపడుతున్నారు. నేను కూడా మిమ్మల్ని కష్టపెట్టానా?" మండోదరి అడిగింది.

"కష్టమా.... హు... నా తండ్రి నాగేటి చాలుతో యజ్ఞార్థము దున్నినప్పుడు నేను దొరికిన పెట్టె పేరే కష్టము. అందుకే ఆ కష్టములోనే ఉన్నాను. పుట్టుకతో కూడా వచ్చిన బంధం అంత తొందరగా పోదుకదా! అందుకే నా కష్టాన్ని గురించి కాదు నా ఆలోచన... మీకు రాబోయే కష్టాన్ని తలచుకొని కుమిలి పోతున్నాను".

సీతమ్మ సౌజన్యానికి మండోదరి విచలితురాలయింది.

"నా భర్త ఎంతో ఉన్నతుడు... ఎంతో చదువుకున్నాడు. అపారమైన పరాక్రమం కలిగిన వాడు. మా కులదైవం పరమశివుడిని తపస్సుతో మెప్పించినవాడు. అంతటి ఉన్నతుడు మిమ్మల్ని అవహరించడం ద్వారా తలదించుకొనే పనిచేశాడు. పది తలలు ఉన్నాయి కనుక ఆలోచనలు పది రకాలుగా పోతున్నాయి. మీకు కష్టం కలిగించినందుకు నా భర్త తరఫున క్షమించమని అడగటానికి వచ్చాను" మండోదరి క్షమార్పణ పూర్వకంగా అడిగింది.

"నిజంగా నా మీద మీకు కోపం లేదా!" సీత అడిగింది.

"కోపం ఎందుకు?"

"పతివ్రతవైన మీకు చెప్పరాని కష్టం కలిగించబోతున్నందుకు?" సీతమ్మ సమాధానం చెప్పింది.

"దూది ఉన్న గదిలో కణకణమంటున్న నిప్పును తెలిసి వేసిన తర్వాత బూడిద ఫలితం అనుభవించి తీరవలసిందే... మీ వంటి ఉత్తమురాలికి తాత్కాలికంగా భర్తృ వియోగం నా భర్త కలిగించిన నేరానికి, నాకు శాశ్వత భర్తృ..." మండోదరికి మాట పూడుకు పోయింది.

తన కన్నీళ్ళని తుడుస్తున్న సీతమ్మ అమృత హస్తంలోని శీతల స్పర్శకి నిలువెల్లా చలించిపోయింది మండోదరి.

"బాధ పడకు మండోదరి.... రేపు అనేదానికి

ఈ రోజు రూపు లేదు. మీ భర్త మనస్సు మారవచ్చేమో... నన్ను నా భర్త సన్నిధికి పంపవచ్చు. అంతా శుభం జరగవచ్చు" సీతమ్మ ఓదార్చాలని ప్రయత్నించింది.

"నా భర్తకు, మీకు మధ్య ఉంచిన గడ్డిపోచ నా జీవితంలో శుభం జరగదని ఎప్పుడో నాకుహెచ్చరించింది" మండోదరి అన్నది.

"పర పురుషునకు నాకు మధ్య వ్యవధానము లేకుండా మాట్లాడకూడదని గడ్డిపోచ ఉంచాను. అంతే" సీతమ్మ సమర్థించుకొనబోయింది.

"మీరు మీ భర్తతో ఉన్న సమయంలో కాకి ఒకటి మీ మీదికి వస్తే ఎంతకీ తొలగక.... మీరు బాధపడుతుంటే.. శ్రీరామచంద్రుల వారు గడ్డిపోచని తీసి అభిమంత్రించారు. అది బ్రహ్మాస్త్రమై, మూడు లోకాలను ఆ కాకిని త్రిప్పించింది. మీ భర్త పరాక్రమాన్ని తెలియజేయడానికి గడ్డిపోచ ఉంచారు. అవునా..." మండోదరి ప్రశ్నకు, భర్తృ పరాక్రమ ప్రస్తావనతో ఆనందంతో కెంపులయిన సీతమ్మ చెక్కిళ్ళు అవునని జవాబిచ్చాయి.

"నా భర్త గడ్డిపరక అంత విలువ చేయదని కూడా ఇంకో అర్థం నాకు అందులో తోస్తోంది. ఇది మాత్రం నాకు బాధ కలిగిస్తోంది. దుర్గుణం విషయంలో మీ సామ్యం సమంజసమైనదేమో కాని, పరాక్రమ విషయంలో నా భర్త ఆ సామ్యానికి పనికి రారు" మండోదరి అన్నది.

తనలాగే భర్తని అమితంగా ప్రేమించి పూజించే మండోదరి పట్ల గౌరవం ఏర్పడింది సీతమ్మకు.

"మీ భర్త ఎంతో అదృష్టవంతులు. మీ వంటి భార్య లభించినందుకు" సీతమ్మ పొగిడింది.

"అ...దృ... ష్టం" ఒక్కొక్క అక్షరాన్ని ఒత్తిపలికింది మండోదరి. "తపోవనములో వారిని మొదటిసారి చూసినప్పుడు అలాగే భావించాను"

"తపోవనమేమిటి?" సీతమ్మ ప్రశ్నించింది.

మండోదరి కొంచెం సిగ్గు పడింది విషయ ప్రస్తావనకు.

"నాన్నగారు... మయులతో ఒక తపోవనంలో ఉన్న సమయంలో వారు నన్ను కలిశారు. తొలి చూపులోనే వారు నన్ను ఇష్టపడ్డారు"

"మీ...రు?" సీతమ్మ గడసరిగా ప్రశ్నించింది.

మందోదరి సిగ్గుల తోరణమయింది.

"మీరు ఏమీ అనుకోనంటే ఒక మాట అడగనా?" సీతమ్మ అడిగింది.

"నిర్భయంగా అడగండి"

"సీతాపహరణము తప్పని... ఇది కూడదని... మిమ్మల్ని వలచి వివాహం చేసుకొన్న మీ భర్తకు ఏనాడైనా చెప్పారా?" సీతమ్మ నెమ్మదిగానే అడిగింది.. కాని ఒంటి మీద కొరడా ఝుళిపించినట్లయింది మందోదరికి.

భర్త చెప్పిన మాట వినడమే పతివ్రతా లక్షణమా? భర్తకు ఇష్టం లేకపోయినా, అతనికి మేలు కలిగించే కఠినమైన సలహా ఇవ్వడం, చేయించడం పతివ్రతా లక్షణం కాదా?... మందోదరికి మనస్సులో ఎన్నో ప్రశ్నలు.

హఠాత్తుగా మెలకువ వచ్చింది మందోదరికి.

ఒంటినిండా చెమట్లు...

కల ఒక్కసారి చెదిరిపోయినందుకు చింతించింది.

కలలోని సీతమ్మ ప్రశ్న తనను వెంబడిస్తున్నట్లనిపించింది.

పక్కకు చూసింది.

తన భర్త చుట్టూ వివిధ భంగిమలలో పదులకొద్దీ నాయికలు.. ఒక ప్రత్యేకమైన శయ్యపై తాను...

తెల్లవారుజాము పూర్తి కావచ్చింది కాబోలు...

రావణుని నిద్రలేపటానికి వందిమాగధులు స్తోత్రం చేస్తున్నారు.

"తన భర్తని స్త్రీ మోహాంధకారం నుండి ఏదైనా అజ్ఞాత శక్తి నిద్ర లేపితే బాగుణ్ణు" ఆ పతివ్రత మందోదరి ప్రార్థించింది కంటి వెంట కారుతున్న కన్నీటి బొట్ల సాక్షిగా...

*(ఈ జాతి ఋణం తీర్చుకోలేని మహాకవి వాల్మీకికి, వాల్మీకి సుందర (కాండ) హృదయాన్ని ఆవిష్కరించిన శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యుల వారికి కృతజ్ఞతలతో)*